మార్కెట్ కమిటీల ఏర్పాటెప్పుడో..

- తుంగతుర్తి నియోజకవర్గంలో రద్దయిన మార్కెట్ పాలకవర్గాలు
- వరుస ఎన్నికలతో నూతన కమిటీల ఏర్పాటులో జాప్యం
- ఆశావహుల ఎదురుచూపు

తిరుమలగిరి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గాలు రద్దయ్యాయి. తుంగతుర్తి నియోజకవర్గంలో తుంగతుర్తి, తిరుమలగిరి, మోత్కూరు, శాలిగౌరారం నాలుగు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. నూతనంగా ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే పాత పాలక వర్గాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. తరువాత రాష్ట్రంలో పలు ఎన్నికల నిర్వహణతో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మరలా నూతన పాలక వర్గాలను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ఈ నెల 5వ తేదీతో ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి అవకాశాలు దక్కని నాయకులు వ్యవసాయ మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులు వస్తాయనే ఆశతో ఉన్నారు.



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

నియోజకవర్గ పరిధిలో 4 మార్కెట్లు..

తుంగతుర్తి నియోజకవర్గంలో నాలుగు వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. గతంలో 2014కు ముందు ఉన్న కాంగ్రెస్ పార్టీ హయాంలో వ్యవసాయ మార్కెట్‌ల పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉండేది. కాని తరువాత ఏర్పడ్డ బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా మార్కెట్ కమిటీ పదవీ కాలాన్ని సంవత్సరానికి కుదించింది. దీంతోపాటు కమిటీ పాలక వర్గాల నియామకాల్లో మహిళలకు 33 శాతం, రిజర్వేషన్లు కల్పిస్తూ చట్ట సవరణ చేసింది. మళ్లీ మార్కెట్ కమిటీ పదవీ కాలాన్ని రెండేళ్లకు పెంచింది. అయితే ఇప్పుడు ఏర్పడిన కొత్త ప్రభుత్వం ఇవే రిజర్వేషన్లు అమలు చేస్తుందా ? లేదా ? అనే ఉత్కంఠ నెలకొంది. పదవుల కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక శాసన సభ్యుడిని, ఇతర ముఖ్య నాయకులను, మంత్రులను కలుస్తున్నారు. పార్టీ గెలుపు కోసం ప్రయత్నం చేసిన పలువురు నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం పోటీ పడుతున్నారు. తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ పరిధిలో తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాలు ఉండగా.. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ పరిధిలో తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం మండలాలు ఉన్నాయి. శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ పరిధిలో శాలిగౌరారం మండలం ఉంది. అడ్డగూడూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాలతో పాటు యాదాద్రి జిల్లా ఆత్మకూరు(ఎం), గుండాల మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలోని వారికే చైర్మన్, డైరెక్టర్ల పదవులు రానున్నాయి.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

మార్కెట్ పాలక వర్గ చైర్మన్, డైరెక్టర్ల రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే పాలక వర్గ నియామకాల ప్రక్రియను ప్రారంభిస్తాం.

- శ్రీధర్, మార్కెట్ కార్యదర్శి, తిరుమలగిరి

క్లుప్తంగా

భట్టి విక్రమార్కకు సన్మానం



విక్రమార్కను సన్మానిస్తున్న సుధీర్‌రెడ్డి

తిరుమలగిరి : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జన్మదినాన్ని పురస్కరించుకొని తిరుమలగిరికి చెందిన తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సంకెపల్లి సుధీర్‌రెడ్డి శనివారం ఆయనను హైదరాబాద్‌లో కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

జన్మదిన వేడుకల్లో మంత్రి వెంకట్‌రెడ్డి



వనన్య జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నూతనకల్లు : తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ తీగల కరుణశ్రీ గిరిధర్‌రెడ్డి కుమార్తె వనన్య జన్మదిన వేడుకల్లో రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. శనివారం మండల కేంద్రంలోని వారి స్వగృహంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వనన్యను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాములమ్మ మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న జగదీశ్‌రెడ్డి

నాగారం : నాగారం ఎంపీపీ కూరం మణివెంకన్న అత్త పంది రాములమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా మృతురాలి భౌతికకాయాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, బీఆర్ఎస్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, చిప్పపల్లి సోమయ్య, ఎల్క సైదులు, కన్నెబోయిన భద్రయ్య, సుధాకర్, పరశురాములు, మురళి, శివ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం తగదు

తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్‌కు విద్యుత్ కమీషన్ పేరుతో నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టి నిరంతరాయంగా విద్యుత్‌ను అందించిన కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టి పబ్బం గడుపుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని తెలిపారు.

రేపు కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సివిజన్ లేజర్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే పరీక్షలకు పెన్షనర్లు, జర్నలిస్టులు, ఆరోగ్యశ్రీకార్డు కలిగిన వారు తమ హెల్త్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డులను తీసుకొచ్చి వైద్యసేవలు పొందాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకుడి మృతి



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మచ్చ వెంకన్న శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో అతడి మృతదేహానికి జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, అర్వపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డు రామలింగయ్య నివాళులర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ దబ్బేటి జ్యోతిరాణి, గ్రామశాఖ అధ్యక్షుడు కసనబోయిన వెంకన్న, మెండె సురేష్, వేముల గణేష్, లింగరాజు, రాజు, సాయిలు, సైదులు, వెంకన్న, సుబ్బులు, సైదులు తదితరులు ఉన్నారు.

మంత్రి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామలకు స్వాగతం

అర్వపల్లి : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి శనివారం అర్వపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కడియం ఇందిరపరమేశ్వర్, దేవస్థానం మాజీ చైర్మన్ బైరబోయిన సైదులు, బైరబోయిన మహరాజు, మూసీ ప్రాజెక్టు మాజీ చైర్మన్ అలువాల వెంకటస్వామి, గ్రామ అధ్యక్షుడు మేకల రాంబాబు, మామిడి స్వరాజ్యం, మామిడి శ్రీను, దిర్శనపు కృష్ణమూర్తి, కుంభం మధు, బైరబోయిన నగేష్, వేణు, పసుపులేటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



అర్వపల్లిలో మంత్రి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం

అర్వపల్లి : తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన నూతనకల్ వెళ్తూ అర్వపల్లిలో ఆగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. నోట్ పుస్తకాలు, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, మేకల రాంబాబు, బైరబోయిన మహరాజు, సైదులు, దిర్శనపు కృష్ణమూర్తి, గుడిపల్లి సోమిరెడ్డి, కుంభం మధు, బింగి కృష్ణమూర్తి, బింగి శ్రీకాంత్, కుంకుడుపాల రవి, పులిచర్ల ప్రభాకర్, యోగి, సాయిని మనోహర్, కోటిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ చామలకు ఘన స్వాగతం

మద్దిరాల : భువనగిరి పార్లమెంట్ సభ్యుడిగా గెలుపొంది మొదటిసారి మద్దిరాల మీదుగా నూతనకల్ వెళ్తున్న చామల కిరణ్‌కుమార్ రెడ్డిని శనివారం మండల కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పచ్చిపాల వెంకన్న, పాక అమృతమల్లు, కొమ్ము అంజయ్య, వల్లపు రమేష్, పులిగిల్ల లింగయ్య, కోడి కుమార్ యాదవ్, మహేష్, కూజ ఎల్లేష్ పాల్గొన్నారు.



కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



అర్వపల్లిలో..

మిషన్ భగీరథ ఇంటింటి సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో మిషన్ భగీరథ ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. శనివారం మండల పరిధిలోని అనంతారం, ఎస్. అన్నారం, పొట్లపహాడ్ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు సరఫరాలో ఇబ్బందులపై ఆరా తీశారు. సర్వేను నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. మిషన్ భగీరథ కనెక్షన్ లేని వారికి కొత్త కనెక్షన్ త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్వేను ఈ నెల 20వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరేష్, ఎంఈఓ నకిరేకంటి రవి, పీఆర్ ఏఈ కిరణ్, పంచాయతీ కార్యదర్శులు విద్యాధర్, హుస్సేన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



నాగారంలో మృతుడు సుధాకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తిరుమలగిరి : గుండెపురిలో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రామచంద్రయ్య

నాగారం : మండల కేంద్రానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు చిప్పలపల్లి సుధాకర్ (డప్పు సుధాకర్) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ గాయకుడు మద్దెల సందీప్, సాంస్కృతిక సారథి కళాకారులు శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కళాకారులు పాలకుర్తి శ్రీకాంత్‌గౌడ్, గద్దం ఉదయ్, పాక ఉపేందర్, దారమల్ల రమేష్, నిరటి ప్రవీణ్, డప్పు రవి, రాచకొండ అంజయ్య పాల్గొన్నారు.

రూ.30వేలు అందజేసిన ఎమ్మెల్యే సామేల్

తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు చిప్పలపల్లి సుధాకర్ (డప్పు సుధాకర్) చిత్రపటానికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ పంపించిన రూ.30,000లను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మంగదుడ్ల దశరథ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జాజుల వీరయ్య, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొలిపాక సాయికుమార్, నాయకులు చిప్పలపల్లి మల్సూర్, వెంకటయ్య, చిప్పలపల్లి అంజయ్య, గద్దల సైదులు, యాదగిరి, జాజుల సవిత్ర, కన్నెబోయిన లింగమల్లు, చిపల్లపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : గుండెపురి గ్రామానికి చెందిన కడియం పావని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులను శనివారం బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వై.ధీన్ దయాళ్, ఎం.యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్ నాయక్, సింగన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తుంగతుర్తి సంత వేలం

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు సంతకు శనివారం వేలంపాట నిర్వహించారు. అనంతుల వెంకన్న రూ.7,74,000లకు వేలం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి రమాణారెడ్డి మాట్లాడారు. గత సంవత్సరం ఈ సంత వేలంపాట రూ.6,59,000 రూపాయలు ఉండగా ఈ సంవత్సరం అదనంగా రూ.1,25,000 వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భీమారెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సంత వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆస్పత్రి ఎదుట ధర్నా

పెన్‌పహాడ్ : సీతారాంపురం గ్రామానికి చెందిన చిలువేరు శ్రీనివాసుపై శనివారం కోతులు దాడి చేశాయి. దీంతో అతడిని చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట, రహదారిపై ధర్నా నిర్వహించారు. చివరికి శ్రీనివాసును చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై మండల వైద్యాధికారి స్రవంతిని వివరణ కోరగా.. స్టాఫ్‌నర్సు లేకపోవడంతో సేవలకు ఇబ్బందిగా ఉన్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.



ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

అవినీతిపై విచారణ జరిపించాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీలో హరితహారం, మొక్కల కొనుగోలు, నర్సరీల నిర్వహణ పేరుతో 2014 నుంచి వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపించారు. అవినీతిపై విచారణ జరిపించాలని జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో నర్సరీలు నిర్వహిస్తూనే బయటి ప్రాంతాల నుంచి మొక్కలు ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందని అన్నారు. బ్లీచింగ్ పౌడర్ కొనుగోలులో లక్షల రూపాయల అవినీతి జరిగిందని తెలిపారు. ట్రాక్టర్‌ల కొనుగోలు కాంట్రాక్టు బీఆర్ఎస్ నాయకుడికి ఇచ్చి నాసి రకం ట్రాక్టర్‌లను కొనుగోలు చేశారని అన్నారు. కొంతమంది బీఆర్ఎస్ కౌన్సిలర్లకే మ్యాన్ పవర్ ఏజెన్సీ కాంట్రాక్టు ఇచ్చి ఒక్కొక్క నిరుద్యోగి వద్ద 2 నుంచి 3 లక్షల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. ప్రతి పనిలో మున్సిపల్ చైర్‌పర్సన్ చేతివాటం ప్రదర్శించారని ఆరోపించారు. గత పదేళ్ల నుంచి మున్సిపాలిటీలో జరిగిన కేటాయింపులు, చెల్లింపుల వివరాలను ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్లు వేములకొండ పద్మ, నామ అరుణ, రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, ధరావత్ రవి, అన్నెపర్తి రాజేష్, ఎలిమినేటి అభినయ్, అనంతుల యాదగిరి గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎడ్ల వీరమల్లు యాదవ్, కుంభం రాజేందర్, చిరివెళ్ల శభరి, మకట్ లాల్, లింగ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన



అర్వపల్లి : రామన్నగూడెంలో విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తిరుమలగిరిలో మాట్లాడుతున్న తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంగ

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన జరుగుతుందని రామన్నగూడెం ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం చిప్పలపెల్లి ధర్మయ్య అన్నారు. రామన్నగూడెం పాఠశాలలో శనివారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మన ఊరు- మన బడితో పాటు అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల ద్వారా పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ తవిటి మమత, ఉపాధ్యాయులు బి.నీరజ, విజయలక్ష్మి, శైలజ, అంగన్‌వాడీ టీచర్ అనిరెడ్డి పుష్ప, వీఓఏ సరిత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థలను నిలబెట్టే బాధ్యత ప్రజా ప్రతినిధులదే

తిరుమలగిరి : ప్రభుత్వ విద్యా సంస్థలను నిలబెట్టే బాధ్యత ప్రజా ప్రతినిధులు తీసుకోవాలని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేపీ. మంగ కోరారు. శనివారం తిరుమలగిరిలో తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చే విధంగా ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆర్.ధనమూర్తి, లక్ష్మయ్య, పి.దేవరాజ్, ఎస్.నర్సయ్య, ఎం.రాములు, నర్సయ్య పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, సైబర్ నేరాలపై అవగాహన

తుంగతుర్తి : నకిలీ విత్తనాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీను నాయక్ అన్నారు. నకిలీ పత్తి విత్తనాలు, సైబర్ నేరాలపై శనివారం మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాతా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా, శాంతిభద్రతలకు ఆటంకం కలిగించకుండా పరిష్కారం చేసుకోవాలని సూచించారు. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, పోలీస్ సిబ్బంది వెంకన్న, సతీష్, లింగరాజు, రవి, బుచ్చిరాములు, రాజు, కళాబృందం సభ్యులు ఎల్లయ్య, గోపి, కృష్ణ చారి, గురులింగం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీనునాయక్

అందుబాటులో విత్తనాలు

అర్వపల్లి : మండల పరిధిలోని కోడూరు గ్రామ ఎన్‌డీసీఎంఎస్ దుకాణంలో వివిధ రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం నిర్వాహకుడు దేశగాని లింగస్వామి తెలిపారు. బీపీటీ 5204, కేఎన్ఎం118, ఎంటీయూ1010, జీకెపద్మ, మహేంద్ర 404, కేఎన్ఎం1638, ఎంటీయూ 1290, 1156, 1010 రకాల విత్తనాలు ఉన్నాయని తెలిపారు. కావాల్సిన రైతులు తీసుకెళ్లాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక



మహేష్

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా కన్నెబోయిన మహేష్ మూడోసారి ఎన్నికయ్యారు. అలాగే డైరెక్టర్లుగా గుండు సత్తయ్య, గంగి కొండయ్య, కన్నెబోయిన రాములు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చింతారెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎన్నికల అధికారి గంట సోమిరెడ్డి, కన్నెబోయిన లింగయ్య, రాంపల్లి సోమన్న, కన్నెబోయిన యాదగిరి, కొరివి అశోక్, గణేష్, పాల ఉత్పత్తి దారులు తదితరులు పాల్గొన్నారు.

చదువుల్లో ప్రోత్సహించడానికే ఉపకార వేతనాలు



జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థిని అంజలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించడానికే ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలను అందజేస్తోందని జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి చెప్పారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బోయపల్లి అంజలి జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక కావడంతో శనివారం ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ విద్యార్థినికి ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇంటర్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనం రానుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, ఇందిర, ప్రసన్నకుమారి, ఉమ, రజిని, పీడీ సోమయ్య, యాదగిరి, లింగస్వామి, వెంకటేశ్వర్లు, సంపత్, వీరప్రసాద్, వెంకట్, చంద్రకళ, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.



సంతోష్

స్కాలర్‌షిప్‌కు ఎంపిక

తిరుమలగిరి : 2023–24 విద్యా సంవత్సరానికి గాను నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు వెలిశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అలకుంట్ల సంతోష్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద విద్యార్థికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి రూ.12 వేల ఉపకార వేతనం లభిస్తుందని తెలిపారు.

హరితహారానికి ముమ్మర ఏర్పాట్లు



అర్వపల్లిలో గుంతలు తీస్తున్న ఉపాధి కూలీలు



మొక్కలు నాటేందుకు తీసిన గుంతలు

అర్వపల్లి : హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలు తీసే కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. లక్ష్యం మేర గుంతలు తీయడానికి అధికారులు ఉపాధి కూలీలతో పనులు చేయిస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా ఈ విడత హరితహారం కార్యక్రమానికి గానూ 1.70లక్షల మొక్కలను వన నర్సరీల ద్వారా పెంచుతున్నారు. అయితే మండలంలో 1,42,744 మొక్కలను నాటేందుకు అధికారులు లక్ష్యాన్ని నిర్ణయించారు. అందులో 51,174 మొక్కలను ఇంటికి ఆరు చొప్పున పంపిణీ చేయనున్నారు. మిగిలిన మొక్కలను ఎస్సారెస్పీ కాలువలు, రోడ్ల వెంట నాటనున్నారు. ఇందుకోసం అన్ని గ్రామాల్లో గుంతలు తీసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్వపల్లిలో ఎస్సారెస్పీ రెండోదశ కాలువల వెంట 2వేల మొక్కలను నాటారు. ఇందుకోసం ఉపాధికూలీలతో నాలుగు రోజులుగా గుంతలు తీసే పనులు చేయించారు.

వర్షాలు పడగానే..

మండల పరిధిలోని గ్రామాల్లో గుంతల తవ్వకాల పనులు జరుగుతున్నాయి. వర్షాలు పూర్తి స్థాయిలో పడగానే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈసారి పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను ఎక్కువగా పెంచుతున్నారు. ప్రస్తుతం మొక్కలు నర్సరీలలో ఏపుగా పెరుగుతున్నాయి.

గుంతలు తవ్వించాం



అర్వపల్లిలో ఎస్సారెస్పీ కాలువల వెంట మొక్కలు నాటేందుకు ఇప్పటికే 2,000 గుంతలను కూలీలతో తీయించాం. మా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 10 వేల మొక్కలను పెంచుతున్నాం. అన్ని మొక్కలు ఏపుగా పెరిగాయి.

- ఎం.మల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ అర్వపల్లి

పనులు జరుగుతున్నాయి



జాజిరెడ్డిగూడెం మండలంలో ఈసారి 1,42,744 మొక్కలను నాటాలని జిల్లా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. అందుకనుగుణంగా 51,174 మొక్కలను ఇళ్లలో నాటడానికి పంపిణీ చేస్తాం. అలాగే 41,741 మొక్కలను ఎస్సీరెస్పీ కాలువలు, రోడ్ల వెంట నాటడానికి గుంతలు తీయిస్తున్నాం.

- చిలుక ఉపేందర్, ఏపీఓ

వైద్యసేవలను వినియోగించుకోవాలి



వైద్యసేవలను పరిశీలిస్తున్న సీడీపీఓ సాయిగీత

తిరుమలగిరి : ఆరోగ్య సిబ్బంది అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి సీడీపీఓ సాయిగీత అన్నారు. శనివారం తొండ గ్రామంలో ఆరోగ్య పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహార పదార్థాలను తీసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ బిచ్చునాయక్, డాక్టర్ సమతారాణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

జలమయంగా హైవే

అర్వపల్లి : అర్వపల్లిలో సూర్యాపేట–జనగామ 365బీ హైవే వర్షాలకు చెరువును తలపిస్తోంది. ఈ హైవేపై సూర్యాపేట, జనగామ రెండు రూట్లలో వర్షపు నీరు నిలిచి దుకాణదారులు, ఇళ్ల యజమానులు అవస్థల పాలవుతున్నారు. శుక్రవారం నుంచి కురుస్తున్న వర్షానికి ఇక్కడి హైవే జలమయంగా మారి నీళ్లు ఎటూ వెళ్లని పరిస్థితి ఏర్పడింది. విషయాన్ని గతంలో స్థానికులు పలుమార్లు సంబంధిత రోడ్డు నిర్మాణ కంపెనీ వారి దృష్టికి తీసుకెళ్లారు. కానీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. అయితే ప్రస్తుతం రోడ్డు నిర్మాణ కంపెనీ కాంట్రాక్టర్ గడువు కూడా ముగిసింది. ఇప్పటికైనా వర్షాలు పడిన ప్రతిసారి హైవేపై నీరు నిలువకుండా చూడాలని ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.



అర్వపల్లిలో హైవేపై నిలిచిన నీళ్లు